# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 339 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 16 జూలై 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: కేటీఆర్

హైదరాబాద్, జులై 15 (నమస్తే ఉదయం) రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు.

# జినోమ్ వ్యాలీతో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు

## ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

### రాబోయే పదేళ్లలో తెలంగాణలో వన్ ట్రిలియన్ ఎకానమీ

### ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జులై 15 (నమస్తే ఉదయం)**

ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కు సీఎం శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.



## గవర్నర్ వద్దకు పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్

### స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా ..

**హైదరాబాద్, జులై 15 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా సర్కారు నిర్ణయంతో రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్-ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది. అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరించాలని నిర్ణయించారు.


న్యాయశాఖ ఆమోదం తర్వాత : పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు (సెప్టెంబర్ 30) సమీపిస్తున్నందున ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ ముసాయిదాగా పంపించింది.

బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు : ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందితే చట్ట సవరణ వెంటనే అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు గడువు విధించిన సంగతి తెలిసిందే.

2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని, అన్ని రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయం సాధించినట్లవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల మంత్రివర్గ సమావేశం అనంతరం వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని

..మిగతా 2లో

## సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చందు నాయక్‌ను హత్య చేయడం దుర్మార్గమైన చర్య



సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చందు నాయక్ దారుణ హత్య

### తెలంగాణ గిరిజన జేపీసీ రాష్ట్ర నాయకులు

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జర్పుల శివప్రచండ డిమాండ్

ఎల్బీనగర్, జూలై 15(నమస్తే ఉదయం) సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చందు నాయక్ ను కొంతమంది దుండగులు హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జర్పుల శివప్రచండ అన్నారు... ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ నర్సాయపల్లి గ్రామం బల్మూరు మండలం నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన కామ్రేడ్ చందు నాయక్ చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలను సోషలిస్టు భావాలను ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ అంచలంచలుగా ఎదుగుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చందు నాయక్ పనిచేస్తున్నారన్నారు... భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీ బాటలో నగరం నడిబొడ్డున భూ పోరాటాలు నిర్వహించి ఇండ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలకై భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచిన చందు నాయక్ ప్రజల్లో మరింత బలపడడంతో అంచలంచలుగా ఎదుగుతున్న గిరిజన ముద్దుబిడ్డను ఓర్వలేని దుర్మార్గులు కక్షగట్టి హత్యకు పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఇంకుడు గుంతలు తప్పనిసరి!

### సకాలంలో కురవని వానలు..

### స్వల్పంగా పెరిగిన ట్యాంకర్ బుకింగ్ లు..

### డెలవరీ మీద దృష్టి సారించాలి..

### అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి సూచన..!




ఖైరతాబాద్, జూలై 15(నమస్తే ఉదయం) గత కొన్నిరోజులుగా ట్యాంకర్స్ బుకింగ్స్ పెరగడంతో.. ట్యాంకర్ బుకింగ్ డెలవరీ మీద దృష్టి సారించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గత మూడు సంవత్సరాలుగా సకాలంలో వర్షాలు పడకపోవడం.. ఈ ఏడాది జూలై 3వ వారమైన సమృద్ధిగా వర్షాలు లేకపోవడంవల్ల.. చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దాంతో ట్యాంకర్ బుకింగ్ లు గత ఏడాదికంటే 36 శాతం పెరిగిందని, అలాగే డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, దానికనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

**ట్యాంకర్ డిమాండ్, సరళి..**

జలమండలి పరిధిలో దాదాపు 1135 ట్యాంకర్లు ఉన్నాయి. వీటిద్వారా రెండు షిఫ్టులలో ప్రజలకు నీరు సరఫరా జరుగుతుంది. నగరంలో ప్రధానంగా 6 డివిజన్లలో(6,15,9,18,22,10 డివిజన్లు) రోజూ బుకింగ్ అయ్యే ట్యాంకర్లలో అధిక శాతం ఇక్కడినుండే వస్తున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్ లు 88 ఉండగా.. మొత్తం 140 ఫిల్లింగ్ పాయింట్స్ ఉన్నాయి.

గత ఏడాది జూలై 1 నుంచి 14 తేదీ నాటికి.. 63,724 ట్యాంకర్ల డిమాండ్ ఉండగా, ఈ సంవత్సరం జూలై 14 నాటికి 86,520 ట్యాంకర్లను వినియోగదారులు బుకింగ్ చేసుకున్నారు. ఇది గత ఏడాదికంటే 36 శాతం

..మిగతా 2లో



## ముగిసిన శుభాంశు శుక్లా రోదసీయాత్ర

### క్షేమంగా భూమ్మీదకు చేరుకున్న భారత వ్యోమగామి

### డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటకొచ్చిన శుభాన్షు

### ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జులై 15 (నమస్తే ఉదయం)**

భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణం ముగిసింది. దాదాపు 18 రోజులపాటూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపిన శుభాన్షు బృందం ఇవాళ క్షేమంగా భూమికి చేరుకున్న విషయం తెలిసిందే. వీరు ప్రయాణిస్తున్న స్పేస్‌క్రాఫ్ట్ మధ్యాహ్నం 3:01 గంటల సమయంలో అమెరికా కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాల్లో ల్యాండ్ అయ్యింది. అనంతరం అక్కడే ఉన్న సిబ్బంది వారి వద్దకు చేరుకొని నౌకలోకి తీసుకొచ్చారు. తాజాగా గ్రూప్ కెప్టెన్ శుభాన్షు డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటకు వచ్చారు. దాదాపు 18 రోజుల తర్వాత గురుత్వాకర్షణను అనుభవించారు. ఇందుకు సంబంధించిన తొలి ఫొటో బయటకు వచ్చింది. వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరడంతో యాక్సియమ్-4 మిషన్ విజయవంతమైంది. ఇక భూమికి చేరుకున్న వ్యోమగాములు ఏడు రోజుల పాటూ క్వారంటైన్‌లో ఉండనున్నారు. ఇస్రోకు చెందిన ఫ్లైట్ సర్జన్లు వారం రోజుల పాటూ వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగా శుభాన్షు శుక్లాతోపాటు నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు వెళ్లారు.

# కేటి దొడ్డి కేజీబీవీ ఎస్ఓ పద్మావతిని తక్షణమే సస్పెండ్ చేయాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై15(నమస్తే ఉదయం) జిల్లా కేంద్రం లోని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ కి విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ అమ్మాయి బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం కారణమైన ఎస్ఓ మీద సమగ్ర దర్యాప్తు చేసి సస్పెండ్ చెయాలి ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఈరోజు జిల్లాలోని అన్ని కేజీవీబీలలో ఎస్వోలు ముడుపులు తీసుకొని వాళ్లకు కావాల్సిన వాళ్లకు సీట్లు అమ్ముకుంటున్నారు. లోకల్ వాళ్ళు ఎవరడిగినా సీట్లు లేవని చేతులెత్తేస్తున్నారు. మరి వేరే జిల్లా వాళ్లకు ఎట్లా సీట్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీ దొడ్డి కేజీబీవీ లో జరిగిన సంఘటన దురదృష్టకరం దీనికి అంతటి కారణం ఆ కేజీబీవీ ఎస్ఓ. ఆమె విద్యార్థులను సరిగా పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటన జరిగింది. కేజీబీవీ లలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. వాటిని బయటకు రాకుండా అక్కడ ఉన్నటువంటి ఎస్వోలు మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు నాన్నమైన భోజనం గాని నాన్నమైన విద్యను గాని వసతులు గాని కల్పించ లేకుండా కప్పిపుచ్చుతున్నారు కొన్ని కేజీబీవీలలో త్రాగడానికి ఫిల్టర్ వాటర్ కూడా లేని పరిస్థితి ఉన్నది. కేజీవీబీల పైన పరివేక్షణ చేయలేనటువంటి అధికారి పైన కూడా చర్యలు తీసుకోవాలి. బిల్డింగ్ మీద నుంచి దూకి కిందపడిన అమ్మాయిని గద్వాల జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చిన సందర్భంగా అక్కడికి విద్యార్థి సంఘాలు చేరుకొని ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఆ ఎస్ ఓ అక్రమంగా తల్లిదండ్రులను బ్లాక్మెయిల్ చేసి మాకు సంబంధం లేదని వారి తల్లిదండ్రుల నుంచి లెటర్ రాయించుకోవడం దుర్మార్గం. మంగళవారం జరిగిన సంఘటనలో ఆ అమ్మాయికి స్పైనల్ కార్డ్ దెబ్బతినిందని ఆర్థోపెటిక్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వెంటనే హైదరాబాద్కు రిఫర్ చేయడం వల్ల ఆమెను హైదరాబాదుకు హుటాహుటిన తరలించారు. ఆమె వైద్యమునకు అవసరమయ్యే ఖర్చులన్నీ కూడా ప్రభుత్వంమే భరించి ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించాలని విద్యార్థుల సంఘాలు డిమాండ్ చేశారు. వెంటనే ఆమె మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేయాలని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్వి జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలీమ్ పాషా, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు దానయ్య, యుఎస్ఎఫ్ఐ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలు తప్పనిసరి!

మొదటి పేజీ తరువాయి...

అధికం.

**ఇంకుడు గుంత తప్పనిసరి..!**

జలమండలి పరిధిలో దాదాపు 14 లక్షల కనెక్షన్లు ఉండగా.. కేవలం 42 వేల గృహాలే ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారు. అందులో 500 మంది.. వేసవి 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు బుక్ చేసుకున్నారు. 22 వేల మంది 90 శాతం ట్యాంకర్లను అంటే.. 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేసుకున్నారు.దీంతో జలమండలి వారి గృహాల్లో సర్వే చేసి.. వారికి ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించారు. దాంతో వారందరికీ ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేసి, 90 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలాగా అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. అలాగే, ఇప్పటివరకు 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేశారు.ఓఆర్ఆర్ పరిధిలోని 300 గజాల పైన ఉన్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు ప్రతిఒక్కరూ నిర్మించుకోవాలని.. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ వివిధ సందర్భాలలో పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని సైతం హెచ్చరించారు. ఇంకుడు గుంతలు లేని వారికి ట్యాంకర్ రేటు పెంచడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.వచ్చే నెల రోజుల్లో అలాంటి వారి జాబితాను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జలయజ్ఞంలో అందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేసారు.



డీఎస్ఓ స్వామి కుమార్

## అక్రమంగా పీడీఎస్ బియ్యం, వరి ధాన్యం వాహనాలను అడ్డుకోబోయిన స్థానికులు

**సరిహద్దు చెక్ పోస్టులో నిఘా కరువు**

**ఆ మిల్లుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు**

మహబూబ్ నగర్ ప్రతి నిధి: తెలంగాణ, కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టు మీదుగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పీడీఎస్ బియ్యం, సీఎంఆర్ వరి ధాన్యం తరలిస్తున్నట్లు అనుమానంతో స్థానికులు వాహనాలను అడ్డుకోబోయారు. అక్రమార్కులు స్థానికులపై వాహనాలతో తొక్కించే ప్రయత్నం చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన కేటిదొడ్డి మండలం నందిన్నె చెక్ పోస్టులో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కేటిదొడ్డి మండలంలోని ఓ రైస్ మిల్లు నుంచి అక్రమంగా రాయచూర్ కు సీఎంఅర్ వరి ధాన్యం, పీడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు స్థానికులు సమాచారం అందింది. అప్రమత్తమైన స్థానికులు నందిన్నె చెక్ పోస్టు వద్ద చెక్ పోస్టు సిబ్బందికి సమాచారం అందించారు. ఆ సమయంలో చెక్ పోస్టు సిబ్బంది ఒక్కరే ఉండటంతో స్థానికులు అక్రమంగా తరలిస్తున్న పీడిఎస్ బియ్యం, సీఎంఅర్ వరి ధాన్యం వాహనాలను ఆపడానికి ప్రయత్నించారు. డ్రైవర్ లు వాహనాలను స్థానికులపైకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు దీంతో భయాందోళనకు గురైన స్థానికులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో పీడీఎస్ బియ్యం లారీ తప్పించకుని రాయచూర్ కు వెళ్లింది. వరి ధాన్యం లోడ్ లారీని తిరిగి మండలంలోని ఆ రైస్ మిల్లుకు తరలించినట్లు సమాచారం. రాత్రి పూట సీఎంఆర్ వరిధాన్యం, పీడీఎస్ బియ్యం అక్రమంగా రాయచూర్ కు తరలిస్తున్నా నందిన్నె చెక్ పోస్టులో పోలీస్ ల నిఘా కరువైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా నందిన్నె చెక్ పోస్టులో సీసీ కెమెరాలు పని చేయకపోవడం కొసమెరుపు. అలాగే జిల్లాలోని రైస్ మిల్లులపై సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే మిల్లర్లు ఈ అక్రమ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది.

**మిల్లులపై చర్యలు తీసుకోవాలి**

కేటిదొడ్డి మండలం నందిన్నెలో ఉన్న ఓ రైస్ మిల్లు నుంచి సిఎంఅర్ వరి ధాన్యం, పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని నందిన్నె గ్రామస్తులు మంగళవారం కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ధాన్యం తరలిస్తున్న క్రమంలో వాహానాలు ఆపేందుకు స్థానికులు ప్రయత్నం చేయడంతో స్థానికులను తొక్కించేందుకు ప్రయత్నం చేశారని, మిల్లులో తనిఖీలు చేసి మిల్లులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

**రైస్ మిల్లును తనిఖీ చేసిన సివిల్ సప్లయ్ అధికారులు**

నందిన్నెలోని రైస్ మిల్లుపై అరోపణలు రావడంతో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లులో అకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో స్టాక్ ,రికార్డులను పరిశీలించారు. అనంతరం చెక్ పోస్టులో పోలీస్ సిబ్బందిని విచారించారు. వరి ధాన్యం వాహనాన్ని స్వాధీనం చేసుకుని పంచనామ నిర్వహించి పలు సెక్షన్ ల కిందా కేసు నమోదు చేసినట్లు డిఎస్ఓ తెలిపారు.

## గవర్నర్ వద్దకు పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో కాంగ్రెస్ బీసీ నేతలు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు వేర్వేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ ప్రభుత్వానిదేనని : తాము ఒత్తిడి తీసుకురావడంతోనే కేంద్ర ప్రభుత్వం 2026లో జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని నిర్ణయించిందని, బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. వాటిని రాజ్యాంగంలో చేర్చి, చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్యలు బీసీ రిజర్వేషన్లపై తమ అగ్ర నాయకులను ఒప్పించి విజయం సాధించాలని పేర్కొన్నారు.



## చెరువులు, కుంటలు, పరిరక్షణే ద్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**గోపాల్పూర్ ఊర చెరువు పునరుద్ధరణకు తగు చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే**

వరంగల్ జూలై 15, (నమస్తే ఉదయం బ్యూరో): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాల్పూర్ ఊర చెరువును నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ ఇరిగేషన్ శాఖల అధికారులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ కలిసి క్షేత్ర స్థాయి లో పర్యటించారు. చెరువు పునరుద్ధరణ కు చేపట్టాల్సిన చర్యలను గురించి స్థానికులు అధికారులతో మాట్లాడి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. తొలుత గోపాల్పూర్ స్థానిక నాయకులు ప్రజలు ఎమ్మెల్యే నాగరాజు ను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు ఊర చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి పూడికతీత , సుందరీకరణ అలాగే కబ్జాకి గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, సి.ఎం.హెచ్ ఓ డా.రాజారెడ్డి హెచ్ ఓ రమేష్ ఈ ఈ సంతోష్ బాబు ఏ సి పి ప్రశాంత్ ఇరిగేషన్ డిఈ హర్షవర్ధన్ మున్సిపల్ డిఈ లు రవికిరణ్ సతీష్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలోవిద్యార్థులకు పుస్తకాలు అందించిన ఏసీపి ప్రశాంత్ రెడ్డి

వరంగల్ జూలై 15, ( నమస్తే ఉదయం బ్యూరో): శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు నూగూరి చంద్రమోహన్, కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని ఖాజీపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలు,బ్యాగులు, వాటర్ బాటిల్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఖాజీపేట ఏసీపి పింగిళి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ అవసరార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ మేమున్నామంటూ ముందుకు సాగుతున్న నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను కొనియాడారు. విద్యార్థులకు పుస్తకాలతో పాటు వాటర్ క్యాన్ తదితర వస్తువులను అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి అవసరాలు ఉన్న పాఠశాల సిబ్బంది నేరుగా వచ్చి కలిస్తే నా వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఖాజీపేట ఎంఈఓ బి .మనోజ్ కుమార్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి. సుదర్శన్ రెడ్డి,గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కోర్ కమిటీ సభ్యులు కే. సునీల్ రెడ్డి, డి .శశికిరణ్, టి. నగేష్, రిసోర్స్ పర్సన్స్ జె రవి, పి యశోద, ఫిజియో తెరపిస్ట్ బి రాజ్యలక్ష్మి,ఎం ఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ పరిజ్ఞానం పై విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

## పిల్లలకు బాల్యం నుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేలా కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

కొత్తకోట, జూలై15 (నమస్తే ఉదయం) పిల్లలకు బాల్యం నుంచే కంప్యూటర్ విద్య పై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన కృత్రిమ మేధస్సు (ఎ ఐ) శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి తిలకించారు. మంగళవారం కొత్తకోట మున్సిపాలిటీలోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి 3-5వ తరగతి విద్యార్థులకు నేర్పిస్తున్న కృత్రిమ మేధస్సు శిక్షణ తరగతులను కలెక్టర్ తనిఖీ చేశారు. కంప్యూటర్ పై విద్యార్థులు చేస్తున్న లెక్కలను నిశితంగా పరిశీలించారు. జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు? ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి?ఎంతమంది విద్యార్థులు నేర్చుకుంటున్నారు అనే వివరాలను జిల్లా విద్యా అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్న 11 పాఠశాలల్లో 3-5 వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు డి. ఈ ఓ తెలిపారు. అదేవిదంగా 6 నుంచి 12వ తరగతి కె .జి.బి.వి, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖాన్ అకాడమీ కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సమస్య లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హెడ్ సెట్ తప్పకుండా పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఇచ్చిన యూజర్ ఐ.డి ఎవరి ఐ.డి వారే వాడేవిధంగా చూడాలని సూచించారు.పదవ తరగతి లెక్కల సబ్జెక్ట్ బోధించడానికి ప్రత్యేకంగా రూపొందిచిన హ్యాండ్ బుక్ విద్యార్థులకు అందరికీ ఇచ్చారా? హ్యాండ్ బుక్ ప్రకారం లెక్కల పాఠాలు బోధిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, ఈ సంవత్సరం లెక్కల సబ్జెక్ట్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలులేదని సూచించారు.అనంతరం అక్కడే కొత్తగా నిర్మిస్తున్న పాశ్రీఠశాల అదనపు గదుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం నిర్ణిత గడువు లోగా పూర్తి చేసేవిధంగా చూడాలని కాంట్రాక్టర్ కృష్ణా రెడ్డిని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మమ్మద్ అబ్దుల్ ఘని , కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎం.ఈఓ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,సుభాష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## నవ్వు ఆరోగ్యానికి దివ్య ఔషధం

**జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ**

జనగామ,జూలై 15(నమస్తే ఉదయం): మానవులు సహజసిద్ధంగా నవ్వే ప్రక్రియ ఆరోగ్యానికి దివ్య ఔషదంగా పని చేస్తుందని జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ అన్నారు. మంగళవారం జనగామ గణేష్ వాడలో జరిగిన "హాస్యపు జల్లులు కవులు కళాకారుల పాత్ర " అనే అంశంపై ఇష్టా గోష్టి నిర్వహించారు. కవి పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి.కృష్ణ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఉరుకుల పరుగుల జీవన పయనంలో ప్రజలు ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారన్నారు..మానసిక ఉల్లాసానికి, ఉత్సాహనికి నవ్వు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు సామాజిక చైతన్యానికి సాహిత్యాన్ని సృజిస్తున్న కవులు హాస్యాన్ని పండించే కడుపుబ్బ నవ్వించే హాస్యంపై కవితలు, పాటలు రాయాలని కోరారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న కవులు హాస్యఛలోక్తులు విసిరి నవ్వుల హరివిల్లుగా వేదికను మార్చారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక లగిశెట్టి ప్రభాకర్, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరాచారి, అభినందన కల్చరల్ సొసైటీ అయిలా సొమనర్సింహచారి, జె ఎస్ కె మ్యూజికల్ రికార్డింగ్ స్టూడియో చిలుమోజు సాయికిరణ్, తెలంగాణ గౌడ రచయితల సంఘం గడ్డం మనోజ్ కుమార్, వర్కింగ్ కమిటీ మెంబర్స్ డాక్టర్ వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, రంగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ జూలై 15,( నమస్తే ఉదయం బ్యూరో): వరంగల్ జిల్లా నూతన కలెక్టరేట్ సముదాయాన్ని తొందరగా పూర్తి చేయాలని వరంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలోని ఆజాంజాయ్ మిల్స్ గ్రౌండ్స్ లో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ సముదాయాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.


# రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా సహకార సంఘాలు పని చేయాలి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బుద్వేల్, జూలై 15 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్, నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 311 ఎఫ్ పీ ఓ లతో నిర్వహించిన సదస్సులో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకారం పరపతి సంఘాలు తమ దృక్పథం మార్చుకోవాలన్నారు. కేవలం ఒకటి లేదా రెండు సేవలకు పరిమితం కాకుండా, రైతులకు సంబంధించి అన్ని సేవల రూపకల్పనలో పాలుపంచుకొన్నట్లయితేనే ఆర్థిక పరిపుష్టి సాధించడంతో పాటు రైతులకు కూడా ప్రయోజనకారిగా ఉండగలమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఉండి సహకార రంగంలో దేశవ్యాప్తంగా రోల్ మోడల్ గా నిలిచిన ముల్కనూరు సహకార పరపతి సంఘ విజయాల్ని ప్రస్తావిస్తూ.. సహకార సంఘ బాధ్యతలు నీతిగా, నిజాయితీగా చేస్తు, సంఘ అభివృద్ధికి పాటుపాడితే ముల్కనూరు లాంటి సహకార సంస్థలు మరిన్ని మన తెలంగాణ రాష్ట్రంలో ఉద్భవించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. భారత ప్రభుత్వం ద్వారా 10 వేల రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్న సందర్భములో, ఇప్పటికే ఉన్న ప్రాథమిక సహకార పరపతి


రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి

సంఘాలను 'రైతు ఉత్పత్తి సంఘులుగా' మార్చి, వారికి మరింత ఆర్థికతోడ్పాటు అందించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేసిందని, తదనుగుణంగా 'నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో, నిర్లిప్తంగా ఉన్న తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ ను క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్ గా నియమించి దాని ద్వారా రాష్ట్రంలో 311 సహకార పరపతి సంఘాలను ఎఫ్ పీ ఓ లుగా ఎన్నిక చేయడం జరిగిందని, వీటికి ఒక్కొకదానికి 15 లక్షల ఈక్విటీ గ్రాంటు , 18 లక్షల మేనేజ్ మెంట్ ఖర్చు మొత్తం 33 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. అంటే 311 ఎఫ్ పీ ఓ లకు రూ .167.93 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మంగళవారం మొదటి విడతాగా రూ . 9 కోట్లు 85 లక్షల 40 వేల రూపాయలు విడుదలయ్యారు. ప్రతి పీఏసీఎస్ కు రూ. 3,16,849 లు విడుదల చేయడం జరిగిందన్నారు . అదే కాకుండ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ లో భాగంగా ప్రతి ఎఫ్ పీ ఓ కు రూ . 2 కోట్లు వరకు లోన్ గ్యారంటీ సౌకర్యం కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలన్ని ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందని వాటిని సద్వినియోగం చేసుకొని ఎదిగే బాధ్యత ప్రతి ఒక్క సభ్యుడి మీద ఉందన్నారు. ఈ సందర్భముగా మెద్చల్ జిల్లా మరియు కొన్ని జిల్లాలలో సహకార పరపతి సంఘాలు సాధించిన విజయాలు ఊటంకిస్తూ రంగారెడ్డి జిల్లా చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాలలో కూరగాయలు, పండ్ల సాగును ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిదీ అని, ఆదేవిధంగా వ్యవసాయంలో ఎరువుల మరియు రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి సహకార సంఘం తీసుకోవల్సిందిగా సూచించారు. రైతులకు కావాల్సిన అన్నీ అవసరాలను, అనగా మట్టినమూనాలు, విత్తనాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, నిల్వ ప్రాసెసింగ్, మార్కెటింగ్, డైరి, పౌల్ట్రీ ఇలా అన్నీ రంగాలలో వాటి సేవలను విస్తరించే విధంగా బిజినెస్ మోడల్ రూపకల్పన చేసుకోవాలని, అదే విధంగా సంఘ సమావేశాలలో ఆయరంగాల్లో నిష్ణాతుల సేవలను ఆహ్వానించి, వారి సలహాలు, సూచనలు పొంది సంఘ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భముగా మంత్రితో పాటు ఎన్ సీ డీ సీ రీజనల్ డైరెక్టర్ శార్దూల్ , తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి , తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు ఛైర్మన్ రవీందర్ రావు తో పాటు డీ సీ సీ బీ ల ఛైర్మన్ లు, కోఆపరేటివ్ సిబ్బంది, రాష్ట్రం నలుమూలాల నుండి వచ్చిన 311 సొసైటీ ఛైర్మన్ లు, పాల్గొన్నారు.


చెన్నమ్మ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై చెలరేగిన మంటలు


సిలిండర్‌కు గోనె తట్టు చుట్టి మంటలను ఆర్పిన బాలు

# టీ చేస్తుండగా పేలిన సిలిండర్

## ధైర్యంగా సిలిండర్ మంటలను ఆర్పిన బాలు

బుద్వేల్, జూలై 15 (నమస్తే ఉదయం):మైలార్ దేవుపల్లి టీ ఎన్ జి ఓస్ సాయి కాలనీ లో మంగళవారం ఉదయం ఓ యువకుని అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. సత్యనారాయణ ఇంటిలో అద్దెకు ఉంటున్న చెన్నమ్మ టీ తయారు చేస్తున్న సమయంలో గ్యాస్ పైప్ నుండి గ్యాస్ లీక్ అయ్యింది. ఈ క్రమంలో సిలిండర్ నుండి మంటలు ఎగసిపడటంతో ఆమె భయంతో కేకలు వేసింది . ఆ సమయంలో రోడ్డు మీదుగా వెళ్తున్న ఆదర్శ కాలనీలో టెంట్ హౌస్ నిర్వహించే బాలు , సమీపం లో నివాసం ఉండే దనరాజ్ ఘటనను గమనించి ధైర్యంగా ఇంట్లోకి ప్రవేశించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారు వెంటనే 100, 101 నంబర్లకు కాల్ చేసి పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. మైలర్ దేవ్ పల్లి ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అపాయం తప్పింది. అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. చుట్టుపక్కల నివాసితులకు గ్యాస్ లీక్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు.ఇద్దరు యువకులు చూపిన సాహసానికి పోలీసులు, స్థానికులు అభినందనలు తెలిపారు. ఇటువంటి అప్రమత్తత, సాహసం ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు.



# నూతన బట్టల దుకాణంలో లిఫ్ట్ కేబుల్ తెగిపోయి 14 మంది మహిళలకు తీవ్ర గాయాలు

## ప్రమాద బాధితులను పరామర్శించిన జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 15 (నమస్తే ఉదయం) నిర్మాణం లో ఉన్న బట్టల దుకాణం లో లిఫ్ట్ కేబుల్ తెగిపోయి ప్రమాదానికి గురై ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాధితులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్వారి శశిధర్ తో కలిసి పరామర్శించారు. సోమవారం ఆర్ సీ పురం మండలం బీరంగూడ కమన్ వద్ద నూతనంగా ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న బట్టల షోరూమ్‌లో పని చేయడానికి వెళ్లిన కార్మికులు లిఫ్ట్ లో సామర్థ్యానికి మించి జనంతో నిండటంతో కేబుల్ వైర్ తెగిపోయి లిఫ్ట్ మూడవ అంతస్తు నుండి గ్రౌండ్ ఫ్లోర్ లో కూలడం తో 14 మంది మహిళలు గాయపడగా, వారిలో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే అయన వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాధితుల కు తీవ్ర గాయాలయ్యాయి, మహిళలకు ఎముకలు విరిగిపోయాయి. వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వారు తెలియజేశారు. ఇంతలో దుకాణ యజమాని పని ప్రదేశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడని బాధితుల బంధువులు ఆరోపించారు. వారికి వెంటనే న్యాయం చేయాలని కోరారు. ప్రమాదం గురైన వారు ఆల్విన్ కాలనీ 124 డివిజన్ ఎన్టీఆర్ నగర్ చెందిన వారిగా గుర్తించారు. భాధితులకి తాను అండగా ఉంటాను అంటూ భరోసా ఇచ్చారు. హాస్పిటల్ సిబందితో తో మాట్లాడి ప్రమాదం జరిగిన వారికీ ఏలాంటి ఇబ్బంది కలగవద్దు అని, వారికి త్వరగా నయం కావాలని కోరారు. వైద్యానికి సంబంధించి ఎంత ఖర్చు ఐనా సరే మెరుగైనా వైద్యం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లపుడు ప్రజల అండగా ఉంటుందని తెలియజేశారు.


హిమాయత్ సాగర్ సౌడమ్మ దేవాలయంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

# హిమాయత్ సాగర్ సౌడమ్మ దేవాలయంలో పూర్వ విద్యార్థుల పూజలు

బుద్వేల్ , జూలై 15 (నమస్తే ఉదయం): హిమాయత్ సాగర్ జలాశయం ఒడ్డున ఉన్న సౌడమ్మ దేవాలయం వద్ద మంగళవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1984, 85 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి చదువుకున్న విద్యార్థుల అపురూప కలయిక, బోనం సమర్పణ చేయడం జరిగింది. దీనికి విచ్చేసిన మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఉదయం 8 గంటలకి మహిళా సోదరులు ఆలయం దగ్గర విచ్చేసి బోనం సమర్పించడం జరిగింది. నరసింహారెడ్డి , సుమన్ రెడ్డి , ఎం రాంబాబు యాదవ్ , వై రామానంద స్వామి , ఎం. నాగభూషణం, వై శ్రీధర్, ఎన్ బాబు రాజ్, బి ఆంజనేయులు తో పాటు మిత్రులందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.


వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ను కలసిన వర్సిటీ బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేయాలి

బుద్వేల్, జూలై 15 (నమస్తే ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగులు, విద్యార్థులు మంగళవారం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వర్సిటీలో బీసీ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. అందుకోసం ఓ వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగులు డాక్టర్ సతీష్ , డాక్టర్ చైతన్య, బిక్షపతి , దశరథ్ , ఎం. రమేష్ , ఎం మురళి, కవిత, కిరణ్, జనార్ధన్, గణేష్ లు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎంపీ

వరంగల్ జూలై 15, (నమస్తే ఉదయం బ్యూరో): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో 7 మంది లబ్ధి దారులకు 6లక్షల 20 వేల రూపాయల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుకు ఎంపీ డా. కడియం కావ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూముఖ్యమంత్రి సహా య నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. పేదల కోసం నిరంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఎన్ బి వై బి వై ఎన్ వి ఎస్ సహకారంతో సాహెబ్ నగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్

వనస్థలిపురం, జూలై15(నమస్తే ఉదయం) సాహెబ్ నగర్ పాఠశాల లో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో గ్రిడ్ డైనమిక్స్ కంపెనీ వారు సిఎస్ఆర్ ఫండ్స్ కింద 20 లక్షల రూపాయల విలువ గల కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం చేశారు . ఈ కార్యక్రమంలో గ్రిడ్ డైనమిక్స్ ఫౌండర్ చైర్మన్ శ్రీ రాజీవ్ శర్మ , నిర్మాణార్గనేషన్ ఆపరేషన్స్ ఇన్చార్జ్ మేడం అనురాధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవి దినేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ పసుపు బోర్డు, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ ఏ ఐడియాలచే భాగస్వాములు, స్టార్టప్‌ల సంప్రదింపుల సమావేశం

బుద్వేల్, జూలై 15 (నమస్తే ఉదయం): భారత ప్రభుత్వ వాణిజ్య , పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జాతీయ పసుపు బోర్డు , నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ ఏ ఐడియా సహకారంతో, రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ లో మంగళవారం వాటాదారులు, స్టార్టప్‌ల సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించింది. దేశంలో పసుపు రంగంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, సమ్మిళితత్వాన్ని పెంపొందించాలనే జాతీయ పసుపు బోర్డు యొక్క దీర్ఘకాలిక దృక్పథాన్ని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్. భవానీ శ్రీ హైలైట్ చేశారు. రైతులు, స్టార్టప్‌లు, పరిశోధకులు మరియు పరిశ్రమ నాయకుల నుండి అట్టడుగు స్థాయి ద్వారా రూపొందించబడిన ఐదు సంవత్సరాల వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను బోర్డు కోసం అభివృద్ధి చేయడానికి ఈ సంప్రదింపులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. పురోగతి కొనసాగుతుండగా, వాటాదారుల ఆకాంక్షలు మరియు డిమాండ్‌లను ఎదుర్కోవడానికి మరియు అభివృద్ధి చేయడానికి జాతీయ పసుపు బోర్డు కి సమయం అవసరమని ఆమె అన్నారు.నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్



సదస్సులో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు


మాట్లాడుతున్న జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్ భవాని శ్రీ

రీసెర్చ్ మేనేజ్మెంట్ ఏ ఐడియా అధ్యక్షుడు, యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ తన అధ్యక్ష ప్రసంగంలో, పంటకోత తర్వాత నష్టాలను నివారించడంతో పాటు పసుపు విలువ గొలుసును బలోపేతం చేయడానికి సహకరించాలని, ఆలోచనాత్మకంగా ఆలోచించాలని మరియు కార్యాచరణ పరిష్కారాలను ప్రతిపాదించాలని కోరారు. అనుభవజ్ఞులైన ఆవిష్కర్తలు మరియు రంగాల నిపుణులతో చర్చల ద్వారా వ్యవస్థాపకులు అపారమైన విలువను పొందగలరని ఆయన నొక్కి చెప్పారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ విద్యా వ్యవస్థల నిర్వహణ విభాగం అధిపతి డాక్టర్ ఎస్. సెంథిల్ వినాయగం వినూత్న ఆలోచనలకు మద్దతు ఇవ్వడానికి, వాటిని ప్రభావవంతమైన ఫలితాలలోకి అనువదించడానికి సంస్థ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆయన ధన్యవాదాలను ప్రతిపాదించారు. ఈ సమావేశంలో దాదాపు 136 మంది వాటాదారులు - 20 మంది స్టార్టప్‌లు మరియు వ్యవస్థాపకులుబీ శాస్త్రవేత్తలు మరియు విద్యావేత్తలు, ఐ సీ ఏ ఆర్ సంస్థల అధికారులు, నేషనల్ టర్మరిక్ బోర్డు ప్రతినిధులుబీ ఇతర పరిశ్రమ సంఘాల అధికారులు పాల్గొన్నారు. స్వయం సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఎగుమతిదారులు, ఇంక్యుబేటర్లు , యాక్సిలరేటర్లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలే

### జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు

గద్వాల ప్రతినిధి, జూలై 15(నమస్తే ఉదయం)వాహనాల డ్రైవర్లు నిత్యం అప్రమత్తతో ఉండాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవింగ్‌పైనే దృష్టి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..డ్రైవర్ల చిన్ననిర్లక్ష్యం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితికి తీసుకువస్తుందన్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అలర్ట్‌గా ఉండాలని, పరిసరాలను నిశితంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. విశ్రాంతి సమయం వృథా చేయకుండా విశ్రాంతి తీసుకోవాలని, విశ్రాంతి తీసుకో కుండా వాహనాలు నడిపితే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. డ్రైవర్ల భావోద్వేగాల స్నీ వాహనాలు ఎక్కే వరకే ఉండాలని, డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాక పూర్తిస్థాయిలో డ్రైవింగ్‌పైనే దృష్టి ఉంచాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్లు మాట్లాడ డం, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించడం చేయవద్దన్నారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు తమ బస్సులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలకు వెళ్లే పిల్లలను బస్సు డ్రైవర్లు చాలా జాగ్రత్తగా తీసుకువెళ్లాలన్నారు. పిల్లలు తరలించే విషయంలో డ్రైవర్లు చాలా జాగ్రత్తలు పాటించాలని, అందుకు పాఠశాల నిర్వాహకులు డ్రైవర్లను అప్రమత్తత చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బస్సులను ఎప్పటికప్పుడు తనీఖి చేసుకోవాలని, సోమవారం అకస్మికంగా అయిజ పట్టణ కేంద్రంలో బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయ్యాయని, ప్రమాదవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. పొరపాటున ప్రమాదం జరిగితే నష్టపోయేది మనమేనని, ఈ విషయని అందరు గుర్తించుకొని వాహనం నడపాలన్నారు. అలాగే వాహనాలకు సంబంధించి




అన్ని పత్రాలు వాహనంలో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తంగా 270 పైగా బస్సులు ఉన్నాయని వాటిలో దాదాపు 90 శాతం పైగా అన్ని వాహనాలు ఫిట్నెస్ నిరూపించుకున్నట్లు తెలిపారు. వాహనాలు నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసిన, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, మద్యం సేవించి వాహనం నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు కృష్ణారెడ్డి, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏవోగా బాధ్యతలు చేపట్టిన యెనమెట్ల రాజవర్ధన్ రెడ్డి



కేటీదొడ్డి,జూలై15(నమస్తే ఉదయం) కేటీదొడ్డి మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం యెనమెట్ల రాజవర్ధన్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. యెనమెట్ల రాజవర్ధన్ రెడ్డి ఇంతకుముందు వనపర్తి జిల్లాలోని పానగల్ మండలంలో వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. కేటీదొడ్డి మండలానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహించిన సాజిద్ రెహమాన్ బదిలీపై జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి టెక్నికల్ ఏవోగా వెళ్లారు.

## ప్రమాదవశాత్తు బిల్డింగ్ మొదటి అంతస్తుపై నుంచి కిందపడిన విద్యార్థిని



గద్వాల ప్రతినిధి, జూలై 15(నమస్తే ఉదయం)కేజీబీవీ బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి విద్యార్థినికి గాయాలైన ఘటన గద్వాల జిల్లా కేటిదొడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విశ్వవిద్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. కేజీబీవీ ఎస్ఓ పద్మావతి, సిబ్బంది కథనం మేరకు మక్తల్ మండలం భూత్పూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య గౌడ్ కూతురు సాయిశృతి కేటిదొడ్డి కేజిబివి జూనియర్ కళాశాలలో విద్యార్థిని ఇంటర్ ఫస్ట్ ఇయ్యర్ (బైపీసీ) చదువుతోంది. మంగళవారం ఉదయం విద్యార్థిని కళాశాల బిల్డింగ్ మొదటి అంతస్తులో తిరుగుతున్న క్రమంలో కండ్లు తిరిగి మొదటి అంతస్తు పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడగా, వెంటనే స్పందించిన సిబ్బంది బాలికను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి కి తరలించారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆసుపత్రి సిబ్బందికి బాలికకు మెరుగైన వైద్యం కల్పించాలని సూచించారు. గద్వాల జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఎంఈఓ వెంకటేశ్వర రావు, విద్యాశాఖ కో ఆర్డినేటర్ హంపయ్య, కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు పరామర్శించి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మావతి మీడియాతో మాట్లాడుతూ, "సాయి శృతి ఓ మంచి అమ్మాయి. కొన్ని రోజులుగా ఇంటి విషయాలతో మానసికంగా నలిగిపోతోందని, భోజనం మానేసి చదువుపై ఆసక్తి చూపడం లేదని చెప్పారు. మంగళవారం ఉదయం నీరసంతో కళ్ళు తిరిగి కిందపడిపోయినట్లు అనిపిస్తోంది," అని వివరించారు.

## దిల్‌కుష్ నగర్‌లో ప్రభుత్వ ఉన్నత నూతన పాఠశాల మంజూరు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషి ఫలించింది.. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్‌పల్లి, జూలై 15 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్ వాసుల చిరకాల స్వప్నం పేద, మధ్యతరగతి బాల బాలికల కొరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలనీ స్థానికులు విజ్ఞప్తి చేశారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పాఠశాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని కోరడంతో స్పందించిన అధికారులు పాఠశాల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి స్థానికులతో కలిసి దిల్ కుష్ నగర్ కమ్యూనిటీ హాల్ ను సందర్శించి బిల్డింగ్ లో మౌలిక వసతులు సరిగ్గా ఉన్నాయా లేదా ఒకవేళ లేనిపక్షంలో కొత్త హంగులతో మరమ్మతులు చేయడానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అతి త్వరగా పరిష్కరించాలి

### సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేష్ కుమార్



జనగామ, జులై 15 (నమస్తే ఉదయం): మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ ( రెవెన్యూ )లతో సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ రెవెన్యూ సదస్సు లలో వచ్చిన దరఖాస్తుల పురోగతి పైన సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సు లలో వచ్చిన దరఖాస్తు లకు సంబందించిన క్షేత్ర స్థాయి విచారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. సరిపడ సిబ్బందిని నియమించుకొని యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు.సాధ్యమైనంత వరకు అన్ని దరఖాస్తులను పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. అలాగే దరఖాస్తుదారులకు సరైన సమాచారం అందించాలన్నారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లతో, అన్ని మండలాల తహసీల్దార్ లతో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ గూగుల్ మీటింగ్ ద్వారా మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని..ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిష్కారం పూర్తి కావాలన్నారు.వీసీ అనంతరం అదనపు కలెక్టర్ బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయన్ని సందర్శించి.. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఇప్పటివరకు ఎన్ని పరిష్కరించారు,ఏ విధంగా పరిశీలిస్తున్నారు తదితర అంశాలను తహసీల్దార్ ను అడిగి తెలుసుకొని తగు సూచనలను జారీ చేసారు.వీసీ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని,కలెక్టరెట్ ఏఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## బిసిల చైతన్యమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి

### రాష్ట్ర వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు

జనగామ జూలై 15 (నమస్తే ఉదయం):బిసిల చైతన్యమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి ఆవిర్భవించిందని సమితి రాష్ట్ర వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని గీతా నగర్ లోని ఓం సాయి ఫంక్షన్ హాల్ లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర కార్యదర్శి పన్నీరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ రావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేస్తూ బిసిల గుండెల్లో భావజాల వ్యాప్తి కోసం ఊరూరా ఇంటింటా ప్రతి బిసి కలుస్తామన్నారు. గ్రామస్థాయి నుండి బిసి ఉద్యమం నిర్మిస్తామని, ఇందులో భాగంగా ఆగస్టు 3న రాష్ట్రవ్యాప్తంగా జండా ఆవిష్కరణ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర నాయకులు గుణిగంటి చంద్రశేఖర్, ఆవుల వెంకట్ యాదవ్, చుంచు శ్రీనివాస్ సెక్రటరీ బ్రహ్మం రజక, రామమూర్తి, ప్రకాష్, జిల్లా నాయకులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, జి.కృష్ణ, మంగళంపల్లి రాజు, ఆలేటి లింగం, గుణిగంటి రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## జనగామ వ్యవసాయ మార్కెట్ అభివృద్దే మా పాలకవర్గ దెయ్యం

### రైతులకు నిరంతరం సేవ చేయడం మా ప్రధాన లక్ష్యం

జనగామ జులై 15(నమస్తే ఉదయం): జిల్లా లోని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశ ప్రధాన ఎజెండాలు: ప్రధానంగా ఏడు అంశాల పైన తీర్మానం చేసారు. నూతన కార్యాలయ భవనం నందు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడం గురించి, కొత్త కవర్షెడ్ నిర్మాణం యొక్క మిగిలిన నిర్మాణం చేపట్టుట గురించి,మార్కెట్ యార్డ్ నందు నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టుట గురించి, కొత్త కార్యాలయం చుట్టూ సిసి నిర్మాణం చేపట్టుట గురించి, మార్కెట్ యార్డ్ లో రోడ్ల నిర్మాణం చేపట్ట గురించి, మార్కెట్ యార్డ్ లో మురికి కాలువల మరమ్మత్తులు నిర్మాణం చేపట్ట గురించి, మార్కెట్ యార్డ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి పై ఏడు అంశాలు చర్చించడం తీర్మానం చేసారు.. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ నూతన ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జి.జీవన్ ను సన్మానం చేసారు, మార్కెట్లో ఖరీదు లైసెన్స్ పొందిన అతని నూతన లైసెన్స్ ఇచ్చి సన్మానం చేయడం జరిగింది. అదేవిధంగా ఈ ప్రజా ప్రభుత్వంలో జనగామ వ్యవసాయ మార్కెట్ యాడ్ కార్యాలయం అభివృద్ధిలో నిరంతరం మేము పనిచేస్తూ జనగామ రైతులకు, మార్కెట్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జి.జీవన్ , ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివ ),ఏఎంసీ డైరెక్టర్లు బిట్ రెడ్డి శ్రీలత రెడ్డి, నామాల శ్రీనివాస్, బానోత్ బస్సీ నాయక్,బొట్ల నర్సింగరావు, నీలం మోహన్,నాగ బండి రవీందర్, తోటకూరి రమేష్ యాదవ్, శీలం కొండల్ రెడ్డి ,వనపర్తి శ్రీనివాస్, బంద కుమారి ,ఎండి బాష్మియా, వర్ష సిద్దేశ్, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు

### జిహెచ్ఎంసి కార్మికులకు చీరలు, అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసిన యువనేత గాదే శివ చౌదరి



కూకట్‌పల్లి, జూలై 15 (నమస్తే ఉదయం) టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. యువనేత గాదె శివ చౌదరి ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీలో పేదవారికి, అలాగే జిహెచ్ఎంసి లో పనిచేసే కార్మికులకు చీరల పంపిణీ చేశారు. అనంతరం వివేకానంద నగర్ కాలనీలోని రాజేశ్వరి అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ లాంటి వ్యక్తి కూకట్ పల్లి నియోజకవర్గానికి రావటం మనందరి అదృష్టమన్నారు. మన కోసం ప్రతినిత్యం 16 గంటలు పని చేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తి పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండడానికి కారణం సిగాచి పరిశ్రమలో 52 మంది, అలాగే కల్తీ కల్లుతో 9 మంది మరణించడం. అయినప్పటికీ కూడా వారి అభిమానులు కూకట్ పల్లి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పుట్టినరోజు కార్యక్రమాలు, సేవ కార్యక్రమాల రూపంలో నిర్వహించడం జరిగింది. ఈ విషయంలో అందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వం వల్ల మనం ఎలా మోసపోయేమో వివరించారు శివ చౌదరీ. మన భవిష్యత్తు మారాలంటే కార్పొరేటర్ కు, ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పాల్సిశేదే అన్నారు. బండి రమేష్ ని మనం గెలిపించుకోవాలి, అలాంటి నాయకుడు పుట్టినరోజులు వేడుకలలో మేము భాగం అవ్వడం ఆనందంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, టీపీసీసీ సెక్రెటరీ గాలి బాలాజీ, అవనిగడ్డ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మూర్తి, డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నితీష్ గౌడ్, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ జ్యోతి, బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ సంధ్య, వైస్ ప్రెసిడెంట్ కల్పన, బండి సుధా, హరి ప్రసాద్ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, బ్లాక్ మహిళా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటా

### ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



కూకట్‌పల్లి, జూలై 15 (నమస్తే ఉదయం) ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎల్లవేళలా ముందు ఉంటానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అక్షయ కాలనీలో రూ. 43 లక్షల నిధులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో మంగళవారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, స్థానిక ఇంటి యజమానుల అసోసియేషన్ సంఘం, కంపెనీ యజమానుల సంఘం ప్రతినిధులతో కలిసి రోడ్డు పండ్లను ప్రారంభించారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి కమ్యూనిటీ హాల్ లో మిగిలి ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పూర్తి చేయాల్సిందిగా కాలనీవాసులు కోరడంతో అతి త్వరలో ఆ పనులు కూడా ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దిడి ప్రభాకర్, హరిబాబు,అలెక్స్, శ్రీరాములు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దుర్గారావు, పాల్గొన్నారు

## వరంగల్ నగరంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన కమిషనర్



వరంగల్ జూలై 15 ,(నమస్తే ఉదయం బ్యూరో): గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఖిలా వరంగల్ 38వ డివిజన్ ప్రాంతాల్లో బల్దియా కమిషనర్ చాహత్ వాజ్పాయ్ శానిటేషన్ తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండి సి ఎం హెచ్ ఓ డాక్టర్. రాజారెడ్డి, ఎమ్ హెచ్ ఓ డాక్టర్. రాజేష్ సానిటరీ హెల్త్ ఇనిస్పెక్టర్లతో కలిసి కమిషనర్ వివిధ డివిజన్లోని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ఇదేమి రాజ్యం...? ఇదేమి రాజ్యం...? దొంగల రాజ్యం...! కాంగ్రెస్ రాజ్యం...!

మల్కాజిగిరి, జూలై 15(నమస్తే ఉదయం) అల్వాల్ సర్కిల్ లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలు గుండాలుగా మారి దౌర్జన్యం ప్రదర్శించి, ఆడ మగ తేడా తెలియకుండా ప్రవర్తించి పలుకులేని దుర్భాషలాడుతూ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై మహిళా కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్ పై, బిఆర్ఎస్ నాయకులపై పోలీసుల సమక్షంలోనే జులూమ్ ప్రదర్శించారు. ఈ సమావేశానికి ఇన్చార్జిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రేక్షక పాత్ర వహించి కొంతమంది ఆలయ కమిటీ సభ్యులకు చెక్కులు అందజేయగానే. గొడవకు దిగడం దౌర్భాగ్యం గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ భర్త మేకల రాము యాదవ్ ను కాంగ్రెస్ నేత లక్ష్మీకాంత్ రెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ప్రోటోకాల్ పాటించకపోవడం అమానుషమని అనంతరం అల్వాల్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసిన మేకల రాము యాదవ్ , కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ , మురుగేష్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశు రాం రెడ్డి జేఏసీ వెంకన్న, అనిల్ కిషోర్ గౌడ్, జీకే హనుమంతరావు, లడ్డు నరేందర్ రెడ్డి, చిన్న యాదవ్, చిందం శ్రీనివాస్, శివ గౌడ్, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్ శోభన్ ,ఢిల్లీ పరమేష్, శరణగిరి, పవన్ ప్రశాంత్ రెడ్డి రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733